



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

గాడి తప్పిన పరీక్షలు...

- ప్రశ్నాపత్రాలు సైతం ఇవ్వని విద్యాశాఖ
- బోర్డుపై ప్రశ్నలు చూసి పరీక్ష రాయాల్సిన దుస్థితి
- 45 నిమిషాల్లో రాయాల్సిన పరీక్ష గంటన్నరపైనే

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'నాడు-నేడు' అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన చదువు, పరీక్షల విషయంలో మాత్రం ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునరిల్లుతుండగా పరీక్షల నిర్వహణ విధానంసైతం అస్తవ్యస్తంగా తయారైంది...

ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతియేటా ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4 పరీక్షలతోపాటు, ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. పరీక్ష అంటే ప్రశ్నాపత్రాలు ఇస్తే విద్యార్థులు వాటికి సమాధానాలు రాయాలి. అయితే ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-3కి ప్రశ్నాపత్రాలు ఇస్తున్న విద్యాశాఖ, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-4 పరీక్షలకు మాత్రం ప్రశ్నాపత్రాలు ఇవ్వడం లేదు. పరీక్షకు గంటన్నర ముందు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రం స్కూళ్లకు పంపుతున్నారు. ఈ పేపర్‌లో ప్రశ్నలను ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే, ఆ ప్రశ్నలను విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మూడు రోజులపాటు ఎఫ్ఎ-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నానావస్థలు పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడు వేలకుపైగా ఉన్నాయి. వీటిలో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువు కుంటున్నారు. ఎఫ్ఎ పరీక్షలకు సమయం 45 నిమిషాలు మాత్రమే. 20 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తే వాటిని రాసుకుని పరీక్ష రాయడానికి విద్యార్థులకు గంటన్నరకుపైగా పడుతోంది. ఈ విధానంలో కాపీయింగ్ పెద్దఎత్తున సాగుతోంది. బోర్డుపై రాసేందుకు ఉపాధ్యాయులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అన్ని ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయడం కష్టతరంగా మారడంతో ఉపాధ్యాయులు



సతమతమవుతున్నారు. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా నిర్వహిస్తున్న పరీక్షల విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలకు ప్రశ్నాపత్రం ఇస్తున్నప్పటికీ జవాబులు రాసేందుకు ఇచ్చే తెల్లకాగితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులూ వసూలు చేయరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎక్కడైనా వసూలు చేసేందుకు ప్రయత్నించినా ప్రధానోపాధ్యాయులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడితప్పింది. ఇప్పుడు పరీక్షల విధానంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వకపోతే విద్యార్థులు ఏవిధంగా పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలి. పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్ని స్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఈవిధంగా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏవిధంగా చదువులో రాణిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముంపు రైతుల పొలాలకు

పరిహారం పెంచుతాం

- 'జగనన్నకు చెబుదాం' కలెక్టర్ సృజన
- గాజులదిన్నె ప్రాజెక్టు పనుల పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గాజులదిన్నె ప్రాజెక్టు ముంపు రైతుల భూములకు పరిహారం పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. జెసి నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హాజరయ్యారు. ముందుగా హెచ్.కైరవాడి గ్రామంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అక్కడి నుంచి గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజులదిన్నె ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం పెంచాలని, భూమికి బదులుగా భూమిని ఇవ్వాలని కోరుతూ ఎన్నేకండ్ల గ్రామ రైతులు ఈశ్వర రెడ్డి, వీరారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూమికి బదులు భూమి ఇవ్వడం కుదరదని, పరిహారం పెంచే విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గంజిహళ్లి రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు ప్రధాన రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న షాదీఖానాకు నిధులు కేటాయించి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎన్.మహబూబ్ వలీ వినతిపత్రం అందజేశారు. అలాగే గోనెగండ్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మేకల సుధాకర్‌కు 2007లో హెచ్.కైరవాడి గ్రామ పరిధిలో 618 సర్వే నెంబరులో 5 ఎకరాలు పొలం మంజూరు చేసి పట్టా ఇచ్చారని, దానిని కొంతమంది ఆక్రమించుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించగా తగిన చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ తెలిపారు. లింగందిన్నె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తమ పొలాన్ని హోల్డ్‌లో ఉంచడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అవసరాల రీత్యా రెండెకరాల పొలాన్ని అమ్ముకున్నామని, అది రిజిస్ట్రేషన్ కాకపోవడంతో గత మూడు సంవత్సరాలుగా తిరుగుతున్నామని, తమ పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి మొత్తం 166 వినతులు రాగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే 84 ఉన్నాయి. జడ్పి సిఇఒ నాసర రెడ్డి, ఎంపిపి నసురుద్దీన్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు కోల్పోతున్నా

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజలు అనారోగ్యాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న హెల్త్‌ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని సిపిఎం నగర్ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సి.హెచ్. సాయిబాబా విమర్శించారు. శుక్రవారం కర్నూల్ నగరంలోని 24వ వార్డు లక్ష్మీనగర్ లో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం వార్డుకమిటీ ఆధ్వర్యంలోఇంటింటికి వెళ్లిప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి నగర నాయకులు సి.శేషాద్రి నాయకత్వం వహించారు. నాయకులు లక్ష్మీ నగర్ ప్రజలను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి దృష్టికి అనేక సమస్యలు తెచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ చాలా దుర్మార్గంగా ఉందని, చిన్నపాటి వర్షం వచ్చిందంటే రోడ్లన్నీ మురుగునీటితో జలమయం అవుతున్నాయన్నారు. వీధుల్లో నడవాలంటే మురుగు నీటిలో నడవవలసి వస్తున్నదని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నా పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారు. ఇవి కాకుండా కరెంటు చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను వంటి భారాలను మోయలేక పోతున్నారన్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు బతకడం కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లక్ష్మీ నగర్ లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, ఉన్న కాలువలు చెత్తమయంగా చెత్తతో నిండిపోయి మురికి కూపాలుగా ఉన్న వీటిని వెంటనే శుభ్రం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రజల పైన వేసిన భారాలను వెంటనే తగ్గించాలని లేదంటే ప్రజలు రాబోయే 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠం వైసిపి ప్రభుత్వానికి చెబుతారని హెచ్చరించారు.



'ఇంటింటికీ సిపిఎం' నిర్వహిస్తున్న నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- ప్రముఖ గ్యాస్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ పేర్కొన్నారు. ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా కర్నూలు మైపర్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయితో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ శంకర శర్మ బ్యాటింగ్ ఆడగా గౌస్ దేశాయి బౌలింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర శర్మ మాట్లాడారు. క్రికెట్ అనేది ప్రపంచానికే కీలకమైన ఆట అని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ఉండేవి క్రీడలని, క్రీడలను ప్రోత్సహించే దేశంలో కుల, మత విద్వేషాలు అసమానతలు ఉండవని చెప్పారు. క్రీడలు కులమతాలకు అతీతమని అన్నారు. ఈ మధ్యకాలంలో వ్యాయామం తక్కువై చిన్నపిల్లల్లోనూ ఊబకాయం సమస్య ఎక్కువ అవుతోందని, ఈ నేపథ్యంలో క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడలు ఒత్తిడి నుంచి ప్రశాంతతను కలుగజేస్తాయని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రజాశక్తి అంటే ప్రజల శక్తి అన్నారు. అందరూ క్రీడలు ఆడాలని సందేశం ఇవ్వాలని కోరారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, డెస్క్ ఇన్‌ఛార్జీ పానుగంటి చంద్రయ్య, ఎడిషన్ కమిటీ సభ్యులు ఎం.రాజు, ఎస్ఎడి.బాషా, మంగయ్య, ఎంయు.వినయ్ కుమార్, ఎల్లాగువేర, సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రముఖ గ్యాస్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ



కర్నూలులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

15న కర్నూలులో టిడిపి భారీ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఈ నెల 15న కర్నూలు నగరంలో శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్చార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి తెలిపారు. శుక్రవారం కర్నూల్ నగరంలోని టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ శాంతియుత ర్యాలీలో అన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను సమీకరించి పాల్గొనేలన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో అక్రమంగా నిర్బంధించిన చంద్రబాబు ఆరోగ్యం క్షీణిస్తున్నదని దీనిపై కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మైనార్టీ నాయకులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నాయకులు బిసి జనార్దన్ రెడ్డి, జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుండి పాఠశాలలకు దసరా సెలవులు

కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు శనివారం నుండి దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట్ రంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి పాఠశాలలు ఈనెల 25న యధావిధిగా తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు.



'నారాయణ'లో ముందస్తు దసరా సంబరాలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : నగరంలో నిమాధవనగర్ లోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ అల్తాఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి దసర వేడుకలకు అర్‌ఐ దుర్గాలక్ష్మి, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ అరుణ ముఖ్య అతిథులుగా హాజరై నవరాత్రుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారులు తొమ్మిది రకాల అమ్మ వారి వేషధారణ అందరిని ఆకట్టు కున్నాయి. అనంతరం విద్యార్థుల సాం స్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరీ రాధ పాల్గొన్నారు.

దసరా సెలవులకు ఊరెళ్తున్నారా జాగ్రత్త : ఎస్‌పి

విలువైన నగలు, నగదు బ్యాంకు లాకర్లలో ఉంచండి

ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్ళితే పోలీసుస్టేషన్‌లో సమాచారమివ్వండి



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : దసరా పండుగ సెలవుల నేపథ్యంలో సొంత ప్రాంతాలకు వెళ్ళే ఆయా కాలనీ, అపార్టు మెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఊళ్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ళకు తాళం వేసి సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్ళల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచవద్దని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో , లాకర్లు లేని వారు వాటిని తమ తెలిసిన వారి ఇళ్ళల్లో లేదా బంధువుల ఇళ్ళల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఇళ్ళకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు ముందస్తుగా సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ పోలీసులు ఆయా ప్రాంతాలలో రాత్రి వేళ ప్రత్యేక నిఘా ఉంచుతారని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. దసరా సెలవులకు తమ సొంత ఊర్లకు వెళ్లే వారు ఈ క్రింది సూచనలు, సలహాలను ప్రతి ఒక్కరూ పాటిస్తే మంచిదన్నారు. ఇళ్ళల్లో నగదు, బంగారు, వెండి, ఇతర విలువైన ఆభరణాలు ఉంచుకోరాదన్నారు. కొందరు తమ బ్యాగుల్లో నగదు, బంగారు , ఇతర ఆభరణాలను ఉంచుకుని బస్సుల్లో , ఇతర వాహనాలలో ప్రయాణం చేసే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, గ్యాస్‌స్టవ్ రిపేర్ పేరిట అపార్టుమెంట్లకు వచ్చే అనుమానిత వ్యక్తులను అనుమతించ కూడదన్నారు. కాలనీలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతూ వుంటే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా డయల్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలకు తాళాలు వేయటంతో పాటు వీలైతే చక్రాలకు కూడా చైన్‌లు కూడిన తాళం వేయటం మంచిదన్నారు. సాధ్యమైనంతవరకు పట్టణ వాసులు తమ ఇండ్లకు సిసి. కెమెరాలను అమర్చుకొంటే మంచిదన్నారు. సీసీ కెమెరాలు ఆన్‌లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సెలవుల్లో ఊర్లకు వెళుతున్న వారు ఇంటి బయట, ఇంటిలో కనీసం 1, 2 లైట్లు వేసి వుంటే మంచిదన్నారు. ఇంటికి ఇరువైపులా నమ్మకమైన వారు ఉంటే మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లటం మంచిదన్నారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాలు ఈ పండుగ సెలవులు ముగిసే వరకు రాత్రి సమయాల్లో గస్తీని ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. అపార్ట్మెంట్ కాంప్లెక్స్ వారు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణములలోనూ , అన్ని వ్యాపార సముదాయాలలో 24గంటలూ సెక్యూరిటీ గార్డ్, వాచ్ మెన్ లను విధిగా నియమించు కోవాలన్నారు. అత్యవసర సమ యాలలో డయల్ 100 లేదా 112 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

టిడ్కోగృహాలపై సమీక్ష

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక న్యూ కౌన్సిల్ హాలులో నగర పాలక కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, టిడ్కో గృహాల లబ్దిదారులకు రుణ మంజూరు స్థితి, రుణ మంజూరు తిరస్కరణకు గల కారణాలు, పరిష్కార మార్గాలపై టిడ్కో విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన విభాగం, వార్డు సంక్షేమ కార్య దర్శులు , నగర పాలక ప్రత్యేక అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ అధికారులందరూ టీములుగా ఏర్పడి రుణ మంజూరు, కాంట్రిబ్యూషన్ పెండింగ్ ఉన్న ప్రతి లబ్దిదారుని వ్యక్తి గతంగా కలిసి, మాట్లాడి పరిష్కారాలు కనుగొనాలని, ఈ ప్రక్రియ అంతా వచ్చే వారంలోపు పూర్తి అవ్వాలని అధికారులను ఆదేశించారు. టిపిఆర్ఒ వెంకటట లక్ష్మీ, టిడ్కో మేనేజర్ పెంచలయ్య , సిఎంఎం మురళి పాల్గొన్నాం



అందరికి ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జగనన్న సురక్ష కార్యక్రమంతో అందరికీ ఆరోగ్యాన్ని అందించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరం లోని 3వ వార్డ్ బండిమెట్ట లో 6,7,8, వ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ...వైసిపి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పనిచేస్తుందన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలను ఇంటి వద్దకే అందించారని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలను, మంత్రులను, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల ఇండ్లవద్దకే పంపి, రావలసిన సంక్షేమ పథకాలు అందాయా?, అభివృద్ధి జరిగిందా? ఇంకా ఏమైనా కావాలా?అని అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. 3వ వార్డ్ కార్పొరేటర్ షాజహా పర్వీన్, ఇంచార్జి ఖాదర్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జి మాబుసభాయ్, ఖుద్దుస్, శానవాజ్, గౌసియా, కరీముల్లాహ్, షబ్బీర్, భీమన్నా, అక్బర్, జయ, రాజు, మాకబౌల్, చాంద్‌బాషా, ప్రజాప్రతినిధులు, అధికారులు వైద్య ఆరోగ్య డాక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

తాగునీరడిగితే సిపిఎం నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో రు.87 లక్షలతో నిర్మించిన సచివాలయాలను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. దేశాయి తండాలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దేశాయి తాండాలో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములును పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దేశాయి తండాలో నెలకొన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని గ్రామస్తులకు ఎమ్మెల్యే శ్రీదేవి హామీ ఇచ్చారు. ఎంపిడిఒ సావిత్రి, వైద్యాధికారి హరిత, డిటి నిజాముద్దీన్, వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత దేవి, చైర్మన్ సోమశేఖర రెడ్డి పాల్గొన్నారు.

తాగునీరివ్వమంటే పోలీసుల నిర్బంధం

తుగ్గలి మండలం దేశాయి తండా తాగునీటి సమస్యను పరిష్కరించాలని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవికి విన్నవించడానికి వెళితే పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టారని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. సచివాలయాల ప్రారంభం, జగనన్న సురక్ష పథకం ప్రారంభించడానికి వస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవికి వినతి పత్రం ఇవ్వకూడదా అని ప్రశ్నించారు. ఒక ప్రజాప్రతినిధికి ప్రజల సమస్యలను తెలపడానికి వస్తే పోలీసులు ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. దేశాయి తాండాలో గత సంవత్సరం నుండి నీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందన్నారు. సిపిఎం తరపున ప్రజల సమక్షంన పోరాడుతుంటే పోలీసులు ఎమ్మెల్యేకి అర్జీ ఇవ్వకుండా చేశారన్నారు. ఇప్పటికైనా పత్తికొండ ఎమ్మెల్యే నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్‌రెడ్డి

పోటో: సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజా మన్ననలు పొందుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయమనోజ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని 39వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారం కోసం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జయ మనోజ్ రెడ్డి మాట్లాడారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే 2024లో మరిన్ని రెట్టింపు పథకాలతో ప్రజల ముందుకు వస్తారన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్, విద్యుత్ ఉద్యోగి హనుమంతు నాయక్, స్టేట్ డైరెక్టర్లు రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, శ్రీదేవి, అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, భాస్కర్, మమ్మతు స్వామి, చిన్న, రామకృష్ణ, కౌన్సిలర్ ఎరుకుల లక్ష్మి, సురేష్, ఈరన్న, అంజి, ఫయాజ్, సూరి, సునీల్, లోకేష్, శంకర్, రమేష్, వీరప్ప ఉన్నారు.

రాక్షసుని పాలనలో నలిగి పోతున్న రాష్ట్రం

- ఆలూరులో మిత్రపక్షాల జెండా ఎగరడం ఖాయం

- జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకప్ప

రాక్షసుని పాలనలో రాష్ట్రం నలిగిపోతోందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. శుక్రవారం ఆలూరులోని జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులను వ్యక్తిగతంగా ధూషించడమే తప్ప రాష్ట్రాభివృద్ధిపై మాట్లాడని ముఖ్యమంత్రి మనకు అవసరమా అని ప్రశ్నించారు. పాలసీలపై మాట్లాడడం చేతకాని ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు పదవులు ఎందుకని నిలదీశారు. ఆలూరు దశాబ్దాలుగా వెనుకబడినా పాలకులు బిల్డింగులు, అక్రమ సంపాదనలతో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ పదేళ్లు అధికారంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి శూన్యమన్నారు. 2024లో రాష్ట్రాన్ని, ఆలూరు నియోజకవర్గాన్ని రాక్షసుల పాలన నుంచి కాపాడుకుని, మిత్రపక్షాల ఐక్యతతో జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షం టిడిపిలో గ్రూపు తగాదాలుంటే నియోజకవర్గ జనసేన దూరంగా ఉండాల్సి వస్తుందని, జనసైనికులను అగౌరపరిచే విధంగా ఉంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఛత్రపతి, రంజిత్, అరవింద్, యశోద, మునీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు



వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

మండలంలోని అంగస్కల్ గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఎన్.జయ రాముడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణస్వామి, మండల నాయకులు షాకీర్ కోరారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రైతు కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, రైతు అప్పులను ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా బ్యాంకులు నోటీసులు ఇవ్వడం ఆపేయాలని, రైతులను ఇబ్బంది పెట్టకుండా, అదనపు వడ్డీలను మాఫీ చేసి సామరస్యంగా అప్పు కట్టించుకోవాల తెలిపారు. తహశీల్దార్ స్పందిస్తూ... జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ బీమాతో పేదలకు ధీమా'

ప్రజాశక్తి -పెద్దకడబూరు

వైఎస్ఆర్ బీమా పథకంతో పేదలకు ధీమా ఉంటుందని సర్పంచి రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం పెద్దకడబూరు మాల కాలనీలో నివసిస్తున్న శంకరమ్మ అనే మహిళ అకాల మరణం పొందడంతో వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేలు అందజేశారు. సచివాల సిబ్బంది సంధ్యారాణి పాల్గొన్నారు.

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రామిక వర్గ శ్రమ దోపిడీ నిర్మూలనే సిఐటియు లక్ష్యమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు నాయకులు బి.శివలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగంలో 40 కోట్ల మంది కార్మిక వర్గం ఉన్నారని తెలిపారు. ఈ కార్మిక వర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం శ్రమ దోపిడి గురవుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్మిక సంక్షేమానికి తూట్లు పొడిచే విధంగా చట్టాలు చేస్తున్నాయని, వీటికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తే అణగతొక్కుతున్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సమీకరించి పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు.

నూతన కమిటీ ఎంపిక

అధ్యక్షులుగా సి.గోవిందు, ఉపాధ్యక్షులుగా బి.గోవర్ధనమ్మ, జె.నాగరాజు, బి.రాజు, రమేష్, బి.కృష్ణ, ఆనందరాజు, ప్రధాన కార్యదర్శిగా బి.రాముడు, సహాయ కార్యదర్శిగా బి.శివలక్ష్మి, ఎస్.నాగలక్ష్మి, షబ్బీర్, కోశాధికారిగా శివలక్ష్మి, కమిటీ సభ్యులుగా లత, రాణి, సుజాత, సల్మాన్, పి.రాజు, శైలజ, లక్ష్మి, ఉస్మాన్ వలీ, జయమ్మ, చంద్ర మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు



అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ రాణించాలి

- మంత్రాలయం నుంచి తొలి సారి రాష్ట్రస్థాయికి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ క్రీడా నైపుణ్యాన్ని చాటాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంపయ్య, ఉపాధ్యాయులు అభినందనలతో ప్రోత్సహించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రభంజనం సృష్టించారు. ఈనెల 9, 10, 11, 12న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ జరిగాయి. ఈ పోటీల్లో మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు తొలిసారిగా ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అండర్-14 షార్ట్‌పుట్ విభాగంలో కె.చరణ్, వాలీబాల్‌లో ఎస్.రాజు, ఫుట్‌బాల్‌లో రాధమ్మ, సెపక్ తక్రాలో రాజశేఖర్, కబడ్డీలో అక్షయ, టెన్నికాయిట్‌లో వైష్ణవి ప్రతిభ చాటారని చెప్పారు. అండర్-17 వాలీబాల్‌లో ఎం.ప్రేమ్‌కుమార్, ఫుట్‌బాల్‌లో భార్గవి, సెపక్ తక్రాలో రామ్‌చరణ్ ప్రతిభ చాటారని తెలిపారు. వీరందరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు బసవరాజు, నరసింహరాజును, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు రామన్న, చంద్ర, విరోబా రావు, నాగభూషణం, ఈరన్న, శివశంకర్, గోపాల్, సుల్తానా, ఉమామహేశ్వరి, ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హత్తి బెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు హత్తి బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 12 కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో సి.శివకుమార్, బాలికల విభాగంలో బి.మానస, అండర్-14 బాలుర విభాగంలో కె.వరుణ్ కుమార్, కె.రియాజ్, బాలికల విభాగంలో సి.చాందిని, నూర్జహాన్ వచ్చేనెల ఎన్‌టిఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కాశీం, బసవరాజు, చంద్రశేఖర్ నాయుడు, నరహరి, ఉషారాణి, వేదవతి, శంకరయ్య, అమీనా పర్వీన్, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్ని బాబు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై సత్తా చాటాలని ప్రధానోపాధ్యాయులు పరిమళామణి, వ్యాయామ ఉపాధ్యాయులు రంగస్వామి ఆకాంక్షించారు. శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురువారం కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో బిల్లేకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి జి.ప్రత్యూష అండర్-17 విభాగంలో రాణించి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం

- మార్కెట్ యార్డు ఛైర్మన్ నారాయణ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కమలమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటునిస్తున్నారని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కమలమ్మ తెలిపారు. శుక్రవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఎఒ జయలక్ష్మి ఆధ్వర్యంలో కమలమ్మ అధ్యక్షతన వ్యవసాయ కమిటీ సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ శాఖ తరపున రైతులకు సబ్సిడీ రూపంలో ట్రాక్టర్లు, ఇతరత్రా పరికరాలు, సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించినట్లు తెలిపారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ద్వారా యాప్‌లో నమోదు చేయించి, కరువు వచ్చిన నేపథ్యంలో నష్టపరిహారం చెల్లిస్తున్నట్లు చెప్పారు. రైతులకు రైతు భరోసా, 'సున్నా' వడ్డీ రూపంలో క్రమం తప్పకుండా చెల్లిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చిప్పగిరి మండలాన్ని ఆస్పిరేషన్ బ్లాక్‌గా ప్రకటించి, సంకల్ప సత్ హై పథకం ద్వారా రెండేళ్ల పాటు ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయనుందని తెలిపారు. ఇందులో భాగంగానే మండలం నుంచి 1000 మట్టి శ్యాంపిల్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నామని చెప్పారు. ఎఇఒ రమాదేవి, కమిటీ సభ్యులు రాజన్న, బాలు, షేకన్న, సతీష్, దేవేంద్ర, రంజిత్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి, సుబ్బరాయుడు, రాకేష్, ప్రతాప్, వంశీ, సునీత, జ్యోతి, రాకేష్, మనోహర్, బాష పాల్గొన్నారు.



నారాయణ, కమలమ్మను సన్మానిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాత పెన్షన్ అమలు చేయాలి

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ గుమ్మల బాబు, హై స్కూల్ కార్యదర్శి సలీం బాషా మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టు కార్డులతో నిరసన తెలిపామని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చెన్నకేశవులు కుటుంబాన్ని ఆదుకోవాలి : మండల విద్యా వనరుల కేంద్రంలో డిటిపి ఆపరేటర్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన చెన్నకేశవులు కుటుంబాన్ని ఆదుకోవాలని డిఇఒ రంగారెడ్డిని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రపాల్ కోరారు. వివిధ పాఠశాలల సందర్శనకు వచ్చిన డిఇఒకు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గంజిహళ్లి, ఎర్రబాడు, నెరుడుప్పల, వెముగోడు, పెద్దమరివీడు గ్రామ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని, నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒత్తిడికి గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.



పోస్టు కార్డు ఉద్యమం నిర్వహిస్తున్న నాయకులు

కోలుకోలేక రైతు మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

కోలుకోలేక రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని బంటుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఈడిగ రంగన్న గౌడ్ (52) గత 5 నెలల క్రితం వ్యవసాయ బోరు మోటార్ వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఆయన కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... రంగన్న గౌడ్‌ను కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి 5 నెలలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేక పోయిందని తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం 'సురక్షం'

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు భీమిరెడ్డి హాజరయ్యారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలతో పాటు వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. వైసిపి నాయకులు బొజ్జప్ప, నాగప్ప, నారాయణ, శీను, పెద్దయ్య పాల్గొన్నారు.

ఆదోని : సమతుల్య ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ రాజు తెలిపారు. వెంకన్న బావి హెల్త్ సెంటర్ ఆవరణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. హెల్త్ క్యాంపులో ఐసిడిఎస్ అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతూ రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలను అధిగమించే దిశగా సమిష్టిగా అవగాహన పరచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ జానకి మాట్లాడుతూ... గర్భిణీగా నమోదైన మహిళకు రెండు నెలల నుంచి కాన్పు అయిన ఆరు నెలల వరకు ప్రతినెలా వైఎస్ఆర్ సంపూర్ణ ఆరోగ్యం సరుకుల కిట్టు ఇస్తున్నామని తెలిపారు. మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటర్ వంట నూనె, కిలో అటుకులు, రెండు కిలోల రాగి పిండి, పావు కిలో బెల్లం, కిలో ఖర్జూరాలు, పావు కిలో చిక్కిళ్లు, ఐదు లీటర్ల పాలు, 25 గుడ్లు ప్రతినెలా ఇస్తామన్నారు. వార్డు ఇన్‌ఛార్జీ మల్లికార్జున, మెప్మా ఉద్యోగి వీరారెడ్డి, అంగన్వాడీ టీచర్లు గౌస్‌బీ, లక్ష్మీదేవమ్మ, వెంకటలక్ష్మి, ఎస్తేరమ్మ ఉన్నారు.



మంత్రాలయంలో సురక్ష కిట్లను అందజేస్తున్న నాయకులు



ఆదోనిలో వంటకాలను రుచి చూస్తున్న డిప్యూటీ ఇంజినీర్ రాజు

స్టాంపు విలువను తగ్గించాలి

- రెండోరోజూ న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

పెంచిన స్టాంపు విలువను తగ్గించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మెస్కిలినీయస్ పిటిషన్లకు రూ.20 పెంచడాన్ని నిరసిస్తూ ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు రెండో రోజూ సాగాయి. ఈ దీక్షల్లో సీనియర్ న్యాయవాదులు గిరిధర్, మజహర్ ఉల్ హక్, గురు మాట్లాడారు. బార్ అసోసియేషన్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే స్టాంపు విలువను పెంచడం సమంజసం కాదని పేర్కొన్నారు. నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జూనియర్ న్యాయవాదులు జీవన్ సింగ్, తరుణ్, హుస్సేన్ సాని, సన్నీ, శేఖర్, సల్మాన్, కృష్ణ, దేవరాజు పాల్గొన్నారు.

ధీరేంద్ర తీర్థులకు విశేష పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీధీరేంద్ర తీర్థులకు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం హొసరిత్తిలో శ్రీధీరేంద్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్ప హారాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు, చతుర్బాహు నరసింహ స్వామి మూర్తికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం ధీరేంద్ర తీర్థులకు మంగళ హారతులు ఇచ్చారు.

చంద్రబాబును విడుదల చేయాలి

- టిడిపి ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి- దేవనకొండ

వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు మండల ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి గద్దెరాళ్ల మారమ్మ అవ్వ గుడి వరకు పాదయాత్ర చేపట్టారు. మార్గమధ్యంలో గల దేవనకొండ చెరువులో జల దీక్ష కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసు పెట్టి జైలులో ఉంచి సైకో జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చీరప్ప, మల్లయ్య, సర్పంచులు భాస్కర్, చెన్నమ నాయుడు, నాగరాజు గౌడ్, హనుమంతు, చిన్న రామప్ప, బాలకృష్ణ, ఎంపిటిసి తిమ్మప్ప, మాజీ సర్పంచులు మల్లికార్జున గౌడ్, సుంకన్న, మాజీ ఎంపిటిసి వెంకటేష్, వెంకటస్వామి గౌడ్, రమణ రెడ్డి, బండ్లయ్య, తిమ్మప్ప, చిన్న రాముడు, యూనిట్ ఇన్‌ఛార్జీలు రాజశేఖర్ గౌడ్, లతీఫ్, రాజగోపాల్ గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య, బాల రంగడు, తెలుగు యువత నాయకులు రాజాసాబ్, ఐ టిడిపి నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు. **ఆదోనిలో** టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ మాట్లాడారు. జైలులో చంద్రబాబు నాయుడు ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, టిడిపి రాష్ట్ర నాయకులు వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, ముస్లిం, మైనార్టీ పట్టణ నాయకులు సాధిక్ వలీ, వెంకటప్ప గౌడ్, నరసింహ, నరసప్ప, బాబురావు, నాగేంద్ర, వీరేష్, చిరంజీవి పాల్గొన్నారు.



దేవనకొండలో మాట్లాడుతున్న విజయభాస్కర్ గౌడ్

బాబుకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి

- టిడిపి యువ నాయకులు గురురాజ్ దేశాయి

నందవరం : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని టిడిపి యువ నాయకులు, దేశాయి నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయి కోరారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించడం వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 73 ఏళ్ల వయస్సులో ఉన్న చంద్రబాబుకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన గది కేటాయించేందుకు అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. సరైన భద్రత కూడా కల్పించకపోవడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని చంద్రబాబుకు సరైన వైద్య సేవలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కన్వీనర్ చిన్న రాముడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ, టిడిపి నాయకులు రామన్న గౌడ్, డబ్బా ఈరన్న, పరశురాముడు, మిట్టాసోమాపురం వీరేష్, శివ, సాధిక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురురాజ్ దేశాయి



మాట్లాడుతున్న హంపి రెడ్డి

'వేరుశనగ విత్తనాలివ్వండి'

ప్రజాశక్తి- దేవనకొండ

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు హంపిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం హంపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులు వ్యవసాయ బావులు, బోర్ల కింద సాగుకు సిద్ధమయ్యారని తెలిపారు. తక్షణమే రాయితీ వేరుశనగ విత్తనాలు ఇవ్వాలని కోరారు. పత్తికొండ ఎడిఎ విజయ మోహన్, ఎఒ సురేష్ బాబు పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ ఈ-క్రాప్ బుకింగ్ ఈకేవైసీ ముగిసిందని, ఇంకా 632 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు. ఎఇఒలు రంగన్న, జయరాం, యోగేంద్ర, వ్యవసాయ సలహా మండలి గౌరవ సభ్యులు మల్లికార్జున, కందనాతి రంగన్న పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

పెద్దకడబూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో ఎంఇఒ సువర్ణ సునీయంకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌టియు మండల కార్యదర్శి షబ్బీర్ మాట్లాడుతూ... మండలంలోని ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతినెలా 1న జీతాలు వచ్చేలా చూడాలని, సర్వీస్ రిజిస్టర్లు నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కోరారు.





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

గాడి తప్పిన పరీక్షలు

- ప్రశ్నాపత్రాలు సైతం ఇవ్వని విద్యాశాఖ
- బోర్డుపై ప్రశ్నలు చూసి పరీక్ష రాయాల్సిన దుస్థితి
- 45 నిమిషాల్లో రాయాల్సిన పరీక్ష గంటన్నరపైనే..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'నాడు-నేడు' అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన చదువు, పరీక్షల విషయంలో మాత్రం ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునారిల్లుతుండగా పరీక్షల నిర్వహణ విధానం సైతం అస్తవ్యస్తంగా తయారైంది...

ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతియేటా ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4 పరీక్షలతోపాటు, ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. పరీక్ష అంటే ప్రశ్నాపత్రాలు ఇస్తే విద్యార్థులు వాటికి సమాధానాలు రాయాలి. అయితే ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-3కి ప్రశ్నాపత్రాలు ఇస్తున్న విద్యాశాఖ, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-4 పరీక్షలకు మాత్రం ప్రశ్నాపత్రాలు ఇవ్వడం లేదు. పరీక్షకు గంటన్నర ముందు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రం స్కూళ్లకు పంపుతున్నారు. ఈ పేపర్‌లో ప్రశ్నలను ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే, ఆ ప్రశ్నలను విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మూడు రోజులపాటు ఎఫ్ఎ-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడు వేలకుపైగా ఉన్నాయి.



వీటిలో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎఫ్ఎ పరీక్షలకు సమయం 45 నిమిషాలు మాత్రమే. 20 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తే వాటిని రాసుకుని పరీక్ష రాయడానికి విద్యార్థులకు గంటన్నరకు పైగా పడుతోంది. ఈ విధానంలో కాపీయింగ్ పెద్దఎత్తున సాగుతోంది. బోర్డుపై రాసేందుకు ఉపాధ్యాయులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోట అన్ని ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయడం కష్టతరంగా మారడంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా నిర్వహిస్తున్న పరీక్షల విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలకు ప్రశ్నాపత్రం ఇస్తున్నప్పటికీ జవాబులు రాసేందుకు ఇచ్చే తెల్లకాగితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులూ వసూలు చేయరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎక్కడైనా వసూలు చేసేందుకు ప్రయత్నించినా ప్రధానోపాధ్యాయులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడితప్పింది. ఇప్పుడు పరీక్షల విధానంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వకపోతే విద్యార్థులు ఏ విధంగా పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలి. పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఈ విధంగా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏవిధంగా చదువులో రాణిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిజెపిని గద్దె దింపుదాం

- దేశాన్ని రక్షించుకుందాం - 23న బస్సు జాతాను జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రంలోని బిజెపిని గద్దె దించి ప్రత్యామ్నాయ ఇండియా కూటమిని గెలిపిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని సాయిరాం కాలేజీలో సిపిఎం నాయకులు కె.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని అన్నారు. ప్రజలపై విచ్చల విడిగా భారాలు మోపి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. 2014లో బిజెపి అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 9 సంవత్సరాలు అవుతున్నా ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతుందని అన్నారు. వంద రోజుల్లో ధరలు అరికడతామని చెప్పి నేడు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్తు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రించడంలో ప్రధాని మోడీ ఘోరంగా వైఫల్యం చెందారని తెలిపారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ నేడు రైతుల అప్పులను, ఆత్మహత్యలను రెట్టింపు చేశారని విమర్శించారు. నల్లధనాన్ని వెలికి తీసి అవినీతిని అరికడతానని, ప్రజల ఖాతాల్లో జమ చేస్తానని మాయమాటలు చెప్పిన నరేంద్ర మోడీ పెద్ద నోట్లను రద్దు చేసి రూ. 2 వేలు నోటు తెచ్చారని, నేడు అవి చలామణిలో లేకుండా పోయాయని చెప్పారు. జిఎస్‌టి పేరుతో సామాన్య ప్రజలపైన విపరీతమైన భారాలు మోపుతూ రాష్ట్రాలకు రావాల్సిన జిఎస్టి నిధులను కూడా రాకుండా కేంద్రం పెత్తనం చేస్తుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకపోగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోడీకి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రత్యామ్నాయ రాజకీయ విధానం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సుజాతాలు నిర్వహిస్తుందని, ఈ నెల 23వ తేదీ నంది కొట్కూరుకు వచ్చే బస్సు జాతాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు, నాయకులు శ్రీనివాసులు, టి ఓబులేష్, ఫకీరు సాహెబ్, టి గోపాలకృష్ణ, ఈశ్వరమ్మ, హుస్సేనమ్మ, ఆంజనేయులు, బేస్తరాజు, నాగన్న, ఎం కర్ణ, జయమ్మ, రంగమ్మ, లింగస్వామి, బాలకృష్ణ, నరసింహులు, ఏసన్న, వెంకటేశ్వర్లు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- నివాళులర్పించిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి




ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం కొండమీదిపల్లె (దళవాయి పల్లె) గ్రామానికి చెందిన రైతు గజ్జల శ్రీనివాసుల రెడ్డి (38) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... కొండమీదిపల్లె (దళవాయిపల్లె) గ్రామానికి చెందిన రైఉత గజ్జెల శ్రీనివాసులరెడ్డి తనకున్న 4 ఎకరాలు పొలాన్ని సాగు చేస్తూ మరో ఐదు ఎకరాలు పొలాన్ని గుత్తకు తీసుకొని పప్పు శనగ పంటను సాగు చేసేవాడు. గత నాలుగేళ్లుగా నుండి పంట సరిగా రాకపోవడం, పంటల సాగు కోసం చేసిన అప్పులకు తీరక వడ్డీలు పెరిగిపోయాయి. దాదాపు రూ. 20 లక్షలకు పైగా అప్పు ఉండడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో శ్రీనివాసులు రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో శనిగలకు పెట్టె మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శ్రీనివాసులు రెడ్డిని తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి అనంతపురానికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈయనకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నివాళులర్పించిన జిల్లా పరిషత్ చైర్మన్

రైతు ఆత్మహత్య విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గ్రామానికి చేరుకుని గజ్జల శ్రీనివాస్ రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడవద్దని, అండగా నిలుస్తామన్నారు. శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. ఆయన వెంట మీర్జాపురం సర్పంచి లాయర్ మహేశ్వర్ రెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, కొండమీదపల్లె నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.



రైతు మృతదేహానికి నివాళు లర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

జగనన్న సురక్ష శిబిరంలో సినిమా పాటలు

- ప్రభుత్వ కార్యక్రమమా..? - ప్రయివేటు ఫంక్షనా..?
- అధిక సౌండ్‌తో ఇబ్బందులు పడిన వైద్యులు, సిబ్బంది, ప్రజలు
- పాటల మ్యూజిక్‌లో మునిగి తేలిన అధికారులు, నాయకులు



సినిమా పాటలు వింటూ ముచ్చట్లాడుకుంటున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్షేత్రస్థాయిలో అధికారులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. నంద్యాల మండలంలోని కానాల గ్రామంలో శుక్రవారం చేపట్టిన జగనన్న ఆరోగ్య శిబిరంలో ఒక పక్క అనారోగ్యంతో వచ్చిన ప్రజలకు వైద్యులు వైద్య సేవలు అందిస్తుంటే మరో పక్క అధికారులు, పాలకులు కలిసి శిబిరంలో సినిమా పాటలు అధిక సౌండ్‌తో వింటూ సరదాగా గడిపారు. అధికారులను, పాలకులను చూసి ఇది జగనన్న ఆరోగ్య శిబిరమా? పార్టీ కార్యాలయమా అన్నట్లుగా ఉందని వైద్యం కోసం వచ్చిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు కలిసి ఈ కార్యక్రమాన్ని వారి నిర్లక్ష్యంతో అబాసుపాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులు, సిబ్బంది వచ్చిన ప్రజలను ఆరోగ్య సమస్యలను తెలుసు కుంటుండగా శిబిరంలో సినిమా, పార్టీ పాటలు పెట్టి వైద్య సేవలకు అంతరాయం కలిగిస్తున్నారు. ప్రశాంతంగా ఉండాల్సిన ఆరోగ్య సురక్ష శిబిరం ఫంక్షన్ హాల్ లాగా ఉందని, ఆ సౌండ్‌కు గుండె జబ్బులు ఉన్నవారి పరిస్థితి ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైద్యం చెయ్యడానికి అడ్డంకిగా మారిన అధిక సౌండ్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనను పకడ్బందీగా చేపట్టండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన ప్రక్రియ పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనను ఈ నెల 16 నుండి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బెల్ ఇంజనీర్లు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జాగ్రత్తగా చేపట్టాలన్నారు. పరిశీలన కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు తప్పక జారీ చేయాలన్నారు.

ముందస్తు దసరా శరన్నవరాత్రి సంబరాలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ పాఠశాలలో ముందస్తు 'దసరా సరదా సంబరాలు' వేడుకలో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నవదుర్గ వేషధారణలతో అలరించారు. ఈ వేడుక సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ యం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు ఈ విజయదశమి అన్నారు. దసరా నవరాత్రులు భక్తి ఆరాధనతో కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు సతీష్, పిడి శ్రీనివాసులు, హరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు మాట్లాడుతూ ఆధునిక కాలంలో అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు డాన్స్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవదుర్గ వేషధారణలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థులు

సెల్‌ఫోన్ల చోరీలో కంటైనర్ డ్రైవరే ప్రధాన నిందితుడు

- 184 సెల్‌ఫోన్లు, రెండు మారుతీ స్విఫ్ట్ కార్లు, మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం
- కేసును ఛేధించిన పోలీస్ సిబ్బందికి ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఫ్లిప్ కార్ట్‌కు చెందిన సెల్ ఫోన్‌లను, రెండు మారుతీ స్విఫ్ట్ కార్లను, మూడున్నర కిలోల గంజాయిను అంతరాష్ట్ర దొంగల ముఠా నుండి స్వాధీనం చేసుకుని రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ పలు విషయాలు వెల్లడించారు. సెల్ ఫోన్‌లు కొట్టేయడంలో కంటైనర్ డ్రైవర్ నయిం ప్రధాన సూత్రధారుడని తేలిందన్నారు. ఐటిఎస్ మేనేజర్ బల్జిత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఐటిఎస్ కంపెనీలో పని చేస్తున్న వాహిద్ ఖాన్, హర్యానా రాష్ట్రంలోని కొందరు వ్యక్తులను పరిచయం చేసుకుని హైదరాబాద్‌కు చెందిన సునీల్‌తో కలిసి హర్యానాలోని గురుగ్రామ్ జిల్లాలోని ఫ్లిప్ కార్ట్ గోడౌన్ నుండి బెంగళూరు ఫ్లిప్‌కార్ట్ గోడౌన్‌కు బయలు దేరిన ఐటిఎస్ కంపెనీ కంటైనర్‌లోని మొబైల్ ఫోన్‌లను గత నెల 10, 11వ తేదీలలో రాత్రి ఆదిలాబాద్ దగ్గరలోని హైవే పక్కన కంటైనర్‌ను ఆపి అందులోని 722 సెల్‌ఫోన్‌లను సంచులలో మూటలు కట్టి కంటైనర్‌ను ఆపి అక్కడ నాయింకు చెందిన కారులో, సునీల్‌కి చెందిన కారులో వేసుకుని, కంటైనర్‌ను బెంగళూరుకు తీసుకెళ్లి వదలిపెట్టి వెళ్లారని తెలిపారు. గత నెల మెయిన్ డ్రైవర్ వాహిద్ ఖాన్, నయిం, ఇతర గ్యాంగ్ సభ్యులు కొన్ని సెల్ ఫోన్‌లను సునీల్ ఇంట్లో పెట్టి మిగతావి మారుతీ స్విఫ్ట్ కారులో మహేంద్ర థార్ వెహికిల్ హర్యానాకు తీసుకెళ్లారని చెప్పారు. ఈ సంఘటనలో పోలీసులు బృందాలుగా నిందితుల కోసం గాలిస్తుండగా శుక్రవారం బెంగళూరు ఎన్ హెచ్-44లోని డోన్ మండలం తాటిమాను కొత్తూరు గ్రామం ఊరి బయట మేవత్ దాబా ముందు ముగ్గురు వ్యక్తులు వాహిద్, షరీఫ్ ఖాన్, సునీల్ బాను దాస్‌లు రెండు మారుతీ స్విఫ్ట్ కార్లు పెట్టుకొని అనుమానాస్పదంగా ఉండగా వారిని డోన్ రూరల్ ఎస్ఐ, పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు చెప్పారు. వారు చేసిన నేరం ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. వారి వద్ద ఉన్న మూడున్నర కిలోల గంజాయిను, 184 సెల్ ఫోన్‌లు, రెండు స్విఫ్ట్ కార్లను స్వాధీనం చేసుకోని నిందుతులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేధించడంలో, నేరస్థులను పట్టుకొనుటలో తీవ్ర ప్రయత్నం చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, డోన్ డీఎస్పీ వై. శ్రీనివాస రెడ్డి, డోన్ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సీఐ షాదీక్ అలీ, సీసీఎస్ రామకృష్ణ, ఎస్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి



జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ఇఒ పెద్దిరాజు

దసరా మహోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 15 నుండి 24 వరకు నిర్వహించే దసరా మహోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌కు శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు అందజేసి శుక్రవారం ఆహ్వానించారు. అలాగే జిల్లా ఎస్‌పి రఘువీరారెడ్డిని, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డిని, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డిని కలిసి దసరా మహోత్స వాలకు రావాలని ఇఒ ఆహ్వానించారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు ఆహ్వాన పత్రికను దసరా మహోత్సవాలకు రావాలని పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి, వేద పండితులు కలిసి అందజేసి ఆహ్వానించారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశారు.

నెరవేరనున్న నిరుపేదల సొంతింటి కల

- 18న టిడ్కో గృహాలు ప్రారంభం - హాజరు కానున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలోని నిరు పేదల సొంతింటి కల సాకారం కానుంది.. 1392 గృహాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో నూతనంగా నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను ఈ నెల 18న ప్రారంభించేందుకు పలువురు ప్రముఖులు రానున్నారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష, పురపాలక శాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహా మండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర అధికారులు రానున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టిడ్కో ఎస్ఇ :

పట్టణంలో ఈ నెల 18న టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా అక్కడ చేరే లబ్ధిదారులకు నీటికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని శుద్ధ జలాన్ని అందిస్తామని అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, కమిషనర్ రమేష్ బాబు శుక్రవారం ఎమ్మెల్యే గంగుల నానిని కలిసి టిడ్కో గృహాలకు సరఫరా చేసే నీటిని చూపించారు. చింతకుంట్ల చెరువు నుండి నీటిని శుద్ధి చేసి తర్వాత క్లోరిరేషన్ చేసి అందజేస్తామని వారు తెలిపారు. శుద్ధి చేయకముందు ఉన్న నీటిని, శుద్ధి చేశాక వచ్చిన నీటిని బాటిల్లో నింపి ఎమ్మెల్యేకు చూపించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేంద్రారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం టిడ్కో ఎస్ఇ, కమిషనర్‌లు టిడ్కో గృహ సముదాయాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.



ఎమ్మెల్యేకు బాటిళ్లలో శుద్ధ జలం చూపిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె : రాజకీయ కక్షతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి అక్రమంగా జైల్లో ఉంచారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం నుండి యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆమె పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడును సిఎం జగన్ అక్రమంగా అరెస్టు చేయించి జైల్లో పెట్టించారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, పాతపాడు, ఎర్రగుడి సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, దొనపాటి వరలక్ష్మి, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్, యాగంటి పల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, నాయకులు కాట్రేడ్డి మల్లికార్జున రెడ్డి, పసుపల బాల నాయుడు, చిన్నరాజుపాలెం నరసింహులు, జోలాపురం తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా యాగంటికి వెళ్తున్న బీసీ ఇందిరా

రాష్ట్ర పోటీలకు విశ్వశాంతి విద్యార్థి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 12న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆళ్లగడ్డ విశ్వశాంతి పాఠశాల నుండి అండర్-17 బాలుర విభాగంలో చరణ్ తేజ 400 మీటర్ల పరుగు పందెం, 400 రిలే పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో జరగబోయే అంతర్రాష్ట్ర స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఆర్ఆర్ అకాడమీ కోచ్ సుబ్బరాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు విక్రమ్‌ను ఆయన అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం





మల్లన్న దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను శుక్రవారం నాడు రాష్ట్ర రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్. కరికాల వలవన్ దర్శించుకున్నారు. గురువారం శ్రీశైలం చేరుకొని ధూళి దర్శనం చేసుకున్నారు. శుక్రవారం శ్రీభ్రమరాంబిక అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకోగా, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు ఉదయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎంపి గోరంట్ల మాధవ్

శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్లను హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వీరు దర్శనార్థమై ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి పెద్దిరాజు వేద పండితులు అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. ఆ తరువాత ముందుగా స్వామి వారి ని అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించు కున్నారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా శేష వస్త్రాలను, ప్రసాదాలను ఇఒ అందజేశారు.

రూ.2.20 కోట్లు బురిడీ కొట్టించిన మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండలంలోని చిన్నదేవలాపురం నారాయణపురం గ్రామాలకు చెందిన రైతుల వరి ధాన్యాన్ని 36 లారీల శాఖమూరి సుబ్బారెడ్డి అనే వ్యాపారస్తుడు ద్వారా కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన మహిళను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. వివరాల్లోకి వెళితే చిత్తూరు జిల్లా తిరుపతినగర్‌కు చెందిన కొండా శిరీష (43) తల్లి కొండా రేవతి, కూతురు ప్రియాంక, తండ్రి శేషయ్య మరో ఇద్దరు వెంకటప్ప, శ్రీనివాసరావు అనే వ్యక్తులు కలిసి చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన శాఖమూరి సుబ్బారెడ్డి అనే వ్యాపారి ద్వారా 36 లారీల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 2.20 కోట్లకు, అలాగే 12 లారీల బియ్యాన్ని రూ1.50 కోట్లకు కొనుగోలు చేశారు. అందులో రూ 1.50 కోట్లు ఇవ్వడం జరిగిందని, మిగతా డబ్బులు అడగగా దౌర్జన్యం చేసే వారి ముఠా తన ఇంటికి వద్దకు వచ్చి మాట్లాడదామని బయటకి తీసుకువచ్చి బెదిరించి తన దగ్గర ఉన్న రూ.50 వేలు బలవంతంగా లాక్కు వెళ్లడం జరిగిందని శాఖమూరి సుబ్బారెడ్డి ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. కొండా శిరీష వారి కుటుంబ సభ్యులు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జిల్లా ఆరోగ్య స్వామి మైసూర్ స్ట్రీట్‌లోని శ్రీ రామ్ ఉమెన్స్ హాస్టల్ నందు ఉండగా పోలీసు సిబ్బందితో వెళ్లి వారిని అరెస్ట్ చేసి తీసుకువచ్చి కోర్టులో హాజరు పరచగా నిందితులకు కోర్టు రిమాండ్ అప్పగించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

రెండోసారి డిసిసి అధ్యక్షులుగా లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా కమిటీ అధ్యక్షులుగా రెండవసారి జె.లక్ష్మీ నరసింహ యాదవ్ ఎన్నికయ్యారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టపడ్డ వారిని గుర్తించి పదవులు ఇవ్వడం చాలా సంతోషమన్నారు. త్వరలోనే జిల్లా కమిటీ కార్య వర్గం నియమిస్తామని తెలిపారు. 2024లో ఎపిలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చే దిశగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



లక్ష్మి నరసింహ యాదవ్‌ను అభినందిస్తున్న పలువురు నాయకులు, కార్యకర్తలు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి - బనగానపల్లె

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చింతమాను మఠం సమీపంలో ఐదవ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని ఎంపీడీవో శివరామయ్య, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మలు ప్రారంభించారు. టంగుటూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో కలిల్, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య భానుముక్కల సహకార సంఘం అధ్యక్షులు నీలి శ్రీనివాసులు, వైసిపి నాయకులు ఈసారి ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని చిత్రేణిపల్లె గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అమర్నాథ్ రెడ్డి, ప్రత్యేక వైద్యాధికారులు స్త్రీ వ్యాధి నిపుణులు కల్పన అమర్నాథ్ రెడ్డి (సర్జన్) విజయలక్ష్మి (జనరల్ మెడిసిన్) పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌లో పౌష్టికాహార పదార్థాలను ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహాశీల్దార్ రవీంద్ర ప్రసాద్, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ చంద్రశేఖర్, ఉపసర్పంచి లింగమ్మతో పాటు వైసిపి నాయకులు మాధవ గౌడ్ నరసింహ శెట్టి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైల మండలం సుండిపెంటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తాసిల్దార్ రాజేంద్ర సింగ్, ఆత్మకూరు సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్



కే.పీ.మస్తానయ్య, పంచాయతీ కార్యదర్శి బాలు నాయక్, స్థానిక వైసిపి నాయకులు వట్టి వెంకటరెడ్డి, భరత రెడ్డి, ఎం.ఏ. రజాక్,ప్రవీణ్ తేజ, గుండయ్య యాదవ్ పర్యవేక్షణలో ఎమ్మెల్యే సూచనల మేరకు ఏర్పాటు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, పిహెచ్సి సెంటర్ల సిబ్బందితో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి గర్భవతులకు,బాలింతలకు పౌష్టిక ఆహారం సంబంధించిన వాటిని పంపిణీ చేశారు. **చాగలమర్రి:** ప్రజలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయవద్దని సర్పంచ్ మాధవి, ఎంపిటీసి రాజేశ్వరి లు సూచించారు. మండలంలోని చింతలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దారు సుభద్రమ్మ,ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఈఓఆర్డి సుదర్శన్ రావుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రషీధాబేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గర్భిణిలకీ శ్రీమంతం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జేసిఎస్ జిల్లా అధ్యక్షుడు బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,వైసిపి నాయకులు గణపతి రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి,లక్ష్మిరెడ్డి,సుదర్శన్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,సుబ్రమాణ్యం,హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** మండల పరిధిలోని మండలంలోని అల్లూరు గ్రామంలో సర్పంచి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, రవీంద్ర నాయుడు, తాసిల్దార్ రాజశేఖర్ బాబు,పాపన్న, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నూరుల్లా, రవీంద్రబాబు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు:** జగనన్న సురక్షతో పేదలకు ఆరోగ్యం అందుతుందని పాములపాడు ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని బానకచర్ల గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టిక ఆహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, ఉపసర్పంచ్ నరసిం హులు, మండల వైద్యాధికారిని గులాబ్ షా, టిబి సూపర్వైజర్ చెరుకు రవికుమార్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డి, నాయకులు అధికారులు పాల్గొన్నారు.



పాములపాడులో..



పార్వతిని అభినందిస్తున్న ఎంపిపి తదితరులు

లక్క సాగరం పార్వతిని అభినందించిన ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన సింగర్ పార్వతిని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి బేతంచెర్ల వైయస్సార్ కార్యాలయము నందు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మన ప్రాంత అమ్మాయి జీ తెలుగు టీవీలో సరిగమపద ప్రోగ్రాంలో ప్రవేశించి అనేక రకాల పాటలు పాడి పలువురి అభినందనలు పొందినదని అందుకు మనమందరం గర్వించాలని అన్నారు. అంతేకాకుండా సింగర్ పార్వతి నాలుగు తెలుగు సినిమాల్లో కూడా పాటలు పాడడం అభినందనీయం అన్నారు. సింగర్ పార్వతి అంచలంచెలుగా ఎదిగి ఎంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కుంచె తిరుమలేశ్వర్ రెడ్డి, గొరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, చంద్రశేఖరయ్యా, మురళి తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో ఏబీఎం పాలెం 1 వార్డులో మరణించిన మల్లికార్జున (అంగవైకల్యం) కుటుంబానికి వైయస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10,000లను వార్డు ఇంచార్జ్ బోల్లెద్దుల రామకృష్ణ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి తరపున బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ సుజాత, వాలంటీర్ అశ్విని, వైయస్సార్సీపి నాయకులు డ్రైవర్ రాజు, గోవిందు, ఐక్య సంఘం నాయకురాలు దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో గ్రాఫర్స్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. ఆత్మకూరు పట్టణంలోని జమ్ములమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈ కమిటీ బేటిలో నూతన అధ్యక్షుడిగా మరోసారి శివగౌడును ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మధుబాబు, ట్రెజరీ అశ్వక్ ఆలి, సెక్రెటరీ రంగస్వామి, జాయింట్ సెక్రెటరీ ఇస్మాయిల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆర్‌బికెల్లో రబీ సీజన్‌కు సబ్సిడీ విత్తులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం నందు ఆత్మకూరు మండలం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరావు అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొండలరావు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం నందు మినుము, శనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిద్దాపురం చెరువు కింద ఉన్న పిల్ల కాలువలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, పశుసం వర్ధక శాఖ సహాయ సంచాలకులు అరుణ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ, ఉద్యానవన శాఖ శ్రీనివాసులు, మత్స్య పరిశ్రమ శాఖ హనోక్, నీటిపారుదల శాఖ ఏఈ శరభారెడ్డి రైతు సంఘం ప్రెసిడెంట్ బైరాపురం మహబూబ్ బాషా, వ్యవసాయ శాఖ సిబ్బంది, అడ్వైజరీ బోర్డు మెంబర్స్, రైతులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ్మో హన్ రెడ్డి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని రెండవ రైతు భరోసా కేంద్రం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆళ్ళగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ఈకెవైసి చేసుకోవాలన్నారు. అనంతరం పశు వైద్యాధికారి సాయి బాబా పశువులకు బీమా పథకం గురించి రైతులకు తెలియజేశారు. సమావేశంలో ఏఓ రంగనేతాజి, ఏఈఓ మంజుల,విహెచ్ఏ పారుఖ్,రైతులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** రైతు సోదరులు సల్ఫర్ సంబంధిత రసాయన ఎరువులను వాడకం తగ్గించాలని ఏఎస్ఓ అరుణకుమారి సూచించారు. శుక్రవారం ఆర్బికే నందు జరిగిన వ్యవసాయ సలహా మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ మాట్లాడుతూ రైతు సోదరులు సాంప్రదాయ ఎరువుల వైపు మొగ్గు చూపాలని రసాయన వాడకం తగ్గించాలని కోరారు. రైతు సోదరులు పైన అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయ సిబ్బంది వారికి పంట కోతపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణ మల్లారెడ్డి, పశువైద్యాధికారి అనూష, వ్యవసాయ అధికారి స్వాతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** నందికొట్కూరు అగ్రికల్చర్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయ అధికారి షేక్షావలి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సంఘ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేశామని తెలిపారు. గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు లభిస్తాయని తెలిపారు.

జిపిఎస్ ఆమోద యోగ్యం కాదు : యుటిఎఫ్


ప్రజాశక్తి - ప్యాపిలి

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని, దాని స్థానంలో ఎలాంటి విధానాన్ని అంగీకరి ంచబోమని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం బూర్గల గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు సిఎంకు పోస్టు కార్డును పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిపిఎస్ ఉపసంహరిం చుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాత పెన్షన్ అమలు చేయాలని అక్టోబర్ 12 నుండి ఒక వారం రోజుల పాటు పోస్టు కార్డ్ ఉద్యమం చేపట్టడం జరుగుతోందని అందులో భాగంగా ఒపిఎస్ కావాలని ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపుతున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకుంటూ ఉంటే మాట ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చని జిపిఎస్ విధానాన్ని తీసుకొని రావడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణా నాయక్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి,జిల్లా కౌన్సిలర్లు శేషయ్య,బొజ్జన్న, సర్వజ్ఞ మూర్తి,చంద్ర మోహన్,అంజనప్ప,హరి నారాయణ,ఆంజనేయ ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్,మండల గౌరవాధ్యక్షులు శంకరయ్య,సహాధ్యక్షులు రమేష్ నాయుడు,ఆర్థిక కార్యదర్శి మధు, ప్రధానోపాధ్యాయులు ఉమా దేవి,పద్మా బాయి తదితరులు పాల్గొన్నారు.



పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పోస్టు కార్డు ద్వారా ముఖ్యమంత్రికి పంపుతున్న ఉపాధ్యాయులు

ఉద్యోగవకాశాలను ఉపయోగించుకోవాలి : చైర్మన్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు మంత్రి బుగ్గన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా 12 కంపెనీలను జాబ్ మేళాకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమాన్ని మున్సి పల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబానికి అండగా నిలవాలన్నారు. జాబ్ మేళాలతో ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ జాబ్ మేళాలో 350 మంది విద్యార్థులు పాల్గొనగా 260 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి,కౌన్సిలర్లు దార.హరినాథ్ రెడ్డి, ఆర్ట్.రమణ,, ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ డోన్ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి,వివిధ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లౌకికవాద మార్గాన్ని ఎంచుకోవాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు/పాములపాడు


బుద్ధుడు, అశోకుడు, అంబేద్కర్ చూపిన లౌకికవాద మార్గాన్ని ఎంచుకోవాలని బీఎస్పీ నాయకులు ఎల్.స్వాములు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గోపాల్ పేర్కొన్నారు. కేరళ నుండి మొదలైన అశోక-అంబేద్కర్ దమ్మ యాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో విజయవంతంగా నిర్వహించి శుక్రవారం పాములపాడు మీదుగా ఆత్మకూరులోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నది. ఈ యాత్రకు బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూర్ అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గోపాల్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈసందర్భంగా పూలే అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా అధ్యక్షులు పుసులూరి చిరంజీవి, నంద్యాల జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లే ఓబులయ్య పాల్గొన్నారు. ఈ యాత్ర తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గుండా మహారాష్ట్రలోని నాగపూర్ దీక్షా భూమికి చేరుకోనుంది.



మాట్లాడుతున్న నాయకులు

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచర్ల



శిరీష (పాత ఫోటో)

వివాహిత మహిళ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బేతంచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్లలోని దుర్గాపేట కాలనీ వాసి మహేష్‌కు నాలుగేళ్ల క్రితం బేతంచెర్ల పట్టణంలోని మంగళి శిరీషతో వివాహం జరిగింది. గురువారం నాడు రాత్రి కుటుంబ సభ్యులు గొడవపడ్డారు. తెల్లవారి సరికి శిరీష (28) ఫ్యానుకు వేలాడుతుండడంతో చుట్టుపక్కల వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పాఠశాలలకు వంట సామాగ్రి పంపిణీ



వంటసామాగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -పాములపాడు

పాములపాడు ఆదర్శ పాఠశాలలో, మండలంలోని ఆయా పాఠశాలలో వంట సామాగ్రి సర్పంచులు, విద్యా కమిటీ చైర్మన్లు శుక్రవారం పంపిణీ చేశారు. పాములపాడు ఆదర్శ పాఠశాలలో గోరుముద్ద వంట సామాగ్రి కార్యక్రమంలో భాగంగా మేకల భాగ్యమ్మ పంపిణీ చేశా రు. వంట సామాగ్రితో విద్యార్థులకు వివిధ రకాల వంటకాలు చేసేందుకు సులభతరంగా ఉంటుందని సర్పంచ్ మేకల భాగ్యమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగ రవీంద్రుడు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథక సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్స్‌లో దసరా సంబరాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని స్కాలర్ స్కూల్ నందు శుక్రవారం నాడు దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కమిషనర్ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నవదుర్గ వేషధారణలో సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ స్కూల్ కరెస్పాండెంట్ లక్ష్మి, డైరెక్టర్ కాలూరి శివప్రసాద్, శ్రీనంది జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్, నందికొట్కూరు వైసిపి పట్టణ ఉపాధ్యక్షులు చింత విజ్జి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



నవ దుర్గల వేషధారణలో చిన్నారులు

వైసిపి ప్రభుత్వానిది ప్రజారంజక పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలనను సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. శుక్రవారం మండలంలోని కోట కందుకూరు గ్రామం లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం జగనన్న ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ డైరెక్టర్ గంగుల విజయ సింహా రెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, కన్వీనర్ కశెట్టి నాగేశ్వరరావు, రాజగోపాల్ రెడ్డి, శేఖర్, కొలిమి బాషా, రామకృష్ణ, కేకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల : మండలంలోని నెహ్రూ నగర్ గ్రామం సచివాలయం 1 పరిధిలో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని వాడ వాడల తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, ఏపీవో మద్దిలేటి, ఏపీఎం శ్రీనివాసులు, పి ఆర్ ఏ ఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ శివకుమార్, కార్యదర్శి వీరన్న యాదవ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, వైసిపి నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సగినేల రమణ, వైసిపి నాయకులు శ్రీనాథ్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు చాగలమర్రి మండల పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కోటయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన నంద్యాల ఎస్‌పిజి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో లక్ష్మీ నరసింహ, వసంత, ఈశ్వర్, వైష్ణవి అలాగే అండర్ 14 విభాగంలో పండు, జెర్సీలో ఎంపిక అయ్యారన్నారు. త్వరలో గుంటూ రు, నంద్యాల జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమం లో పిడి దాదా పీర్, ఉపాధ్యాయులు శాస్త్రి, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, మహబూబ్ బాషా, వెంకట రాముడు, శంకర్, సురేష్ అప్ప, మోహన్ రాజు, ప్రవీణ కుమారి, పిఇటి భారతి పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

డిగ్రీ కళాశాలలో తృణధాన్యాల ప్రదర్శన

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

స్థానిక నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం నాడు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భాన్ని పురస్కరిం చుకొని వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత అధ్యక్షన తృణధాన్యాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ శాలి సాహెబ్ మాట్లా డుతూ తృణధాన్యాలలో పోషక విలువలపై వివరిం చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర మహాసంగ్రామ సభను జయప్రదం చేయండి

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య మాదిగ

ప్రజాశక్తి - బేతంచర్ల

ఈనెల 18న జరగబోతున్న మాదిగల కురుక్షేత్ర మహాసంగ్రామ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి రాజయ్య మాదిగ కోరారు. శుక్రవారం నాడు స్థానిక కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రామసుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో కురుక్షేత్రం మహా సంగ్రామ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. కర్నూల్‌లోని దేవి శ్రీ ఫంక్షన్ హాల్ నందు జరుగుతున్న కురుక్షేత్ర మహాసభలు జయప్రదం చేయడానికి మాదిగ మేధావులు పెద్దలు, విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల మద్దిలేటి మాదిగ, పట్టణ అధ్యక్షులు నత్తి జయరాజ్, మాదిగ కార్యదర్శి మసిమద్దయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి

చంద్రబాబుతోనే అభివృద్ధి : మాండ్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నంద్యాల పార్లమెంటు ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జగన్మోహన్ రెడ్డి వికృతానందం పొందుతున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్నా అధికార పార్టీ నాయకులు, మంత్రులు బాధ్యతారహితంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం బాబుతో నేను పోస్టర్‌తో నాయకులందరూ చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, వీరం ప్రసాద్ రెడ్డి, లాయర్ జాకీర్ హుస్సేన్, ముత్తు జావలి,కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, నారపు రెడ్డి, గంజాయి నాగమణి,ఎస్ఎండి జమీల్, రసూల్ ఖాన్, పలుచాని మహేశ్వర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి,మద్దిలేటి, నిమ్మకాయల రాజు, కళాకారు, అప్సర్,వడ్డే శీను,తమ్మడపల్లి ఏసేపు,సురేష్, మసాలా కాజా,తదితరులు పాల్గొన్నారు.

విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి: ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులు విద్యలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ సుభాన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పాలమరి ఎంపిపి పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులకు ఒకటవ తరగతి నుంచి విద్య నేర్పుణ్యాని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పింది వినడంతో పాటు రాయడం అలవర్చుకున్నప్పుడే విద్యలు నైపుణ్యత పొందుతారన్నారు. ప్రతి సబ్జెక్టులో చదివి రాసినప్పుడే సబ్జెక్టు గుర్తుండిపోతుందన్నారు. విధులు వెనుకబడిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ సుభాన్